ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సుండ్రుపుట్టులో గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు

- చింతపల్లి, హుకుంపేటలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ

చింతపల్లి/చింతపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాజంగి పంచాయతీ పరిధిలోని రేగుబయిలు, బూడిదపాడు, వనజాజుల, ఉమ్మరాసగొంది, గొడుగుమామిడి, కరకపల్లి, బెన్నవరం, బోయపాడు, టి.కోరుకొండ, బాసింగికొత్తూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలన అందుతుండడతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు కోరారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరి జనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్య క్రమం పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పంట: అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ ఇంటా సంక్షేమ పథకాల పంట పండుతోందని, దీంతో గిరిజనులు ఆనందంగా జీవనం సాగిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శోభకోట పంచాయతీ సుండ్రుపుట్టు గ్రామంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఆయకు గ్రామస్తులు పూలమాలలతో ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 87 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా గ్రామల్లో మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలువురు విన్నవించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఏవో సరోజిని, ఆర్‌ఐ రంగారావు, సర్పంచ్‌లు చిన్నారావు, సాంబ, సన్నిబాబు, ఎంపీటీసీ సభ్యులు కొండమ్మ, మీనా, నాయకులు కోటిబాబు, జైరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సురేష్‌కుమార్‌కు పురస్కారం



సీఎండీ సంతోష్‌రావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సురేష్‌కుమార్

రాజవొమ్మంగి: మండలంలోని ట్రాన్స్‌కో ఇంజినీర్‌గా పనిచేస్తున్న జి.సురేష్‌కుమార్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎండీ(ఏపీఈపీడీసీఎల్) కె.సంతోష్‌రావు చేతులమీదుగా విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సురేష్‌కుమార్ ప్రశంసాపత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు, స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్‌లు, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని భూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో జరుగుతున్న తారు రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, సర్పంచ్‌లు కె.ముక్తమ్మ, డి.నీలకంఠం, నేతలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజనుల ఎన్నో ఏళ్ల రహదారి కల నేరవేరుతోందన్నారు. శివారు గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించా రు. ఎంపీటీసీ సభ్యురాలు రాజులమ్మ, నాయకులు అర్జున్, తిరుపతి, పులిరాజు, భాస్కర్, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏడీ అశ్వత్థామ

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కుట్టి, కుజభంగి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పశువులు, గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు చేసి, టీకాలు వేశారు. ఆయా గ్రామాల్లో శిబిరాలను ఏడీ అశ్వత్థామ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. పశువులు అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్యం అందించాలన్నారు. పశుసంవర్ధక వైద్యాధికారి గౌతమ్, రాజశ్రీ సిబ్బంది సుబ్బారావు, త్రినాథరావు, ప్రకాష్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



పంప్ ఆపరేటర్ సత్యనారాయణకు ప్రశంసాపత్రం ఇస్తున్న సర్పంచ్ తదతరులు

ఎటపాక: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాడేరులో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న రాబిన్ సుదర్శన్‌కు ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. తోటపల్లి సచివాలయం పరిధిలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బండారు సత్యనారాయణకు ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని సర్పంచ్ మోసం దుర్గాలక్ష్మి, సచివాలయం అధికారులు అందజేశారు.పలువురు వారిని అభినందించారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రెండు రోజులుగా తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో గౌరీపరమేశ్వరులను ఊరేగించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ సారథుల ఎంపిక వేగవంతం



కన్వీనర్ సంపత్‌కుమార్‌కు గృహ సారథుల వివరాలను అందజేస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో చినలబుడ పంచాయతీ పరిధిలో ఉన్న 14 గ్రామలకు చెందిన 20 మంది గ్రామ వలంటీర్ల పరిధిలో ఎంపిక చేసిన గృహ సారథుల వివరాలను నాయకులు గృహ సారథుల మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్‌కు శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గృహ సారథుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే మండలంలో 14 పంచాయతీల్లో ఎంపిక ప్రక్రియ చివరిదశలో ఉందన్నారు. ఎమ్మెల్యే పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామదాసు, నాయకులు రఘునాథ్, రామారావు, పూర్ణ, హస్తినకుమార్, సోమేష్, గురు, దొన్ను తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతుల సమస్యలు పరిష్కరించాలి

అనంతగిరి: వేంగడ పంచాయతీలోని కాఫీ రైతులతో శుక్రవారం కాఫీ రైతుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చిన్నబాబు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాఫీ రైతుల సమస్యలను పరిష్కరించాలని, కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



పాతరూడకోటలో బాలింతకు సూచనలిస్తున్న సీడీపీవో రాజ్యలక్ష్మి

పెదబయలు: మండలంలోని పాత రూడకోట అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో రాజ్యలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పౌష్టికాహారం పంపిణీ తదితర విషయాలను ఆరా తీశారు. ప్రీ స్కూల్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, గర్భిణులు, బాలింతలను కలిశారు. పౌష్టికాహారం తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి నెల హిమోగ్లోబిన్ పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలో వెళ్లి ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. ప్రసవ సమయంలో అరకులోయ, పాడేరులో ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో చేరాలన్నారు. సూపర్‌వైజర్ సింహాచలం, సిబ్బంది శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



గాంధీనగరంలోని ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో తిరిపాల్

జి.మాడుగుల: మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం, వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్‌లు దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించాలని ఏటీడబ్ల్యూవో తిరిపాల్ ఆదేశించారు. మండలంలో గాంధీనగరం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్ 521 మందికి విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆహారం తీసుకొనే ముందు సబ్బుతో శుభ్రపరచుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. ఎంపీహెచ్‌ఈవో ఎన్.ప్రకాష్, హెచ్‌ఎం సుభద్రమ్మ, ఏఎన్‌ఎం చిన్నతల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జి సత్యనారాయణ

వీఆర్ పురం: ఉమ్మిడిపురం గ్రామంలో ఇటీవల ఎంపికైన గృహ సారథుల సమావేశం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు గృహ సారథుల ఎంపిక ప్రక్రియ వేగవంతంగా చేస్తున్నామన్నారు. గ్రామాల్లో గృహ సారథులు పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రేఖపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మి, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకులు వెంగళరావు, కాంతారావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న సూరిబాబు

పెదబయలు: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా యాప్‌లపై వ్యాయామ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ పి.సూరిబాబు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిగత వివరాలను యాప్‌లలో పొందుపర్చాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. మండల స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ బి.కోటేశ్వరరావు, పీడీ సాధురాం, హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రుణ యాప్‌లతో అప్రమత్తం



చెరకుంపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ షేక్ బాజిలాల్

రాజవొమ్మంగి: ఆన్‌లైన్‌లో రుణ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని సీఐ షేక్ బాజిలాల్ సూచించారు. చెరకుంపాలెంలో ఆయన శుక్రవారం పర్యటించారు. స్థానికులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ యాప్‌ల ద్వారా అందిస్తున్న రుణాలపై ఆధారపడి, ఇబ్బందులకు గురికావద్దన్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లైసెన్స్, వాహనపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఎస్‌ఐ షరీఫ్, గ్రామస్తులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రంపచోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రిషియన్, ప్లంబర్ యూనియన్ నాయకులు

రంపచోడవరం: మండల కేంద్రంలో శుక్రవారం ఎలక్ట్రిషియన్ దినోత్సవాన్ని నిర్వహించారు. సాయిదుర్గా ఎలక్ట్రిషియన్ అండ్ ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ మంగా బొజ్జయ్య మాట్లాడుతూ యూనియన్‌ల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. రమణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్



ట్రైసైకిల్‌ను అందజేస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా స్పందన కార్యక్రమంలో శుక్రవారం ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ ఓ దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందజేశారు. హుకుంపేట మండలం దుగిడుపుట్టు గ్రామానికి చెందిన గడ్డంగి అప్పన్న కుమారుడైన 5వ తరగతి చదువుతున్న గడ్డంగి రాము వైకల్యంతో బాధపడుతున్నాడు. దీంతో ట్రై సైకిల్ కోసం విద్యాంగుడు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి. ఈశ్వర్‌రావును సంప్రదించారు. దీంతో అర్హుడైన రాముకు శుక్రవారం పాడేరులో ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ చేతుల మీదుగా ట్రై సైకిల్ అదజేశారు. కోశాధికారి అప్పారావు, సభ్యులు గౌరీ శంకర్, లోహితాస్, రఘు, కిరణ్, సింహాచలం, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబుకు మాతృవియోగం



మాతృమూర్తి కొండమ్మతో ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు (ఫైల్)

పాడేరు రూరల్ : రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాతృమూర్తి సతక కొండమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. పాడేరు మండలం డి.గొందూరు పంచాయతీ కరకపుట్టు గ్రామానికి చెందిన సతక కొండమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం ఆమె తన ఇంటి వద్ద మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కరకపుట్టు గ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు చెప్పారు.

ఘనంగా రాజులుబాబు పండగ



గుడి వద్ద బారులు తీరిన భక్తులు

గొలుగొండ: నర్సీపట్నం డివిజన్‌లో ప్రసిద్ధి గాంచిన రాజులుబాబు పండగ ఎర్రవరం, చీడిగుమ్మల గ్రామాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎర్రవరం రాజులుబాబు గుడి వద్ద 20 వేల మంది భక్తులు వచ్చి స్వామివారికి కానుకలు సమర్పించుకున్నారు.

గురువారం రాత్రి ఎర్రవరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి చీడిగుమ్మలలో తీర్థంతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గొలుగొండ, నర్సీపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎడ్లబళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి: తిమిరాంలో సూర్యనారాయణస్వామి తీర్థం సందర్భంగా శనివారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీల ను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ. 2వేలు, వెయ్యి రూపాయల చొప్పున బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామదాసు, నాయకులు

అరకులోయ రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మరో పదేళ్ల పాటు పొడిగింపుపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని అరకులోయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.రామదాసు అన్నారు. మండల కేంద్రంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. రామదాసు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పదేళ్ల పాటు గడపు పొడిగింపు చేయడంతో ఏజెన్సీలో విస్తృతంగా అభివృద్ధి జరుగుతుందని, గిరిజనుల జీవన ప్రమాణాలు మార్పుచెందుతాయన్నారు. గిరిజనుల గుండెల్లో ఆరాధ్యదైవంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం పొందారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమన్నారు. నాయకులు రఘునాథ్, దొన్ను, రాజారమేష్, హస్తినకుమార్, సోమేష్, గురు, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



సమావేశంలో పూర్వ విద్యార్థులు, గురువులు

ఎటపాక: సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం గురువారం పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. తమను ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువుల పాదాభిషేకం చేసి సన్మానించారు. సహచర విద్యార్థికి వారంతా కలిసి రూ.25 వేల నగదు సాయం అందజేశారు. రిటైర్డ్ గురువులు రమణ, ప్రదీప్, నాగభూషణం, సర్పంచ్ రాజులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ కర్నికలంక నుంచి ఎం.నిట్టాపుట్టు వరకు ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు గంగరాజు, చిట్టిబాబు శుక్రవారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణంతో సింగర్బ పంచాయతీలో రచ్చపల్లి, నిట్టాపుట్టు కర్నికలంక తదితర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ఏపీవో రామేశ్వరం, నాయకులు సూర్యప్రకాష్ నాయుడు, ధనలక్ష్మి, గృహ సారథులు రామాచారి, వలసమ్మ ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

డుంబ్రిగుడ: అరకు సంతబయలు గ్రామంలో కల్వరి బాప్టిస్టు చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గున ప్రారంభించారు. శిబిరంలో సుమారు 514 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు జానకమ్మ, నాయకులు సింహాచలం, కృష్ణారావు, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : మండలంలోని పిడతమామిడి పీహెచ్‌సీ పరిధిలోని కొత్తాడ పునరావాస కాలనీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 62మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుశీల, జయకుమారి, వీర్రాజు, ఆశ వర్కులు రత్నాబాయి, సత్యకుమారి, వెంకటలక్ష్మి, అపర్ణ, చెల్లాయమ్మ సత్యవతి పాల్గొన్నారు.

నేడు తీర్థం

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారంలో మాడుగుల సమితి తొలి అధ్యక్షుడు చంద్రమ్మదొర తీర్థం శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏటా రథసప్తమి రోజున ఇక్కడ తీర్థం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.